

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి..

- అధికారుల పనితీరు మరింత మెరుగుపడాలి
- పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు
- దిశ సమావేశంలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్



దిశ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్


మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అధికారులను ఆదేశించారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారుల పనితీరు సరిగా లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్యక్షతన నిర్వహించగా జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరి సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, అభివృద్ధి పనుల నిర్వహణ, సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులు నివేదికలను చదివి వినిపించారు.

ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని ఆయన పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ శాఖలకు వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దిశ ప్రాముఖ్యతను గుర్తించి సమావేశంలో ప్రతిపాదించిన, చర్చించిన పరిష్కార విషయాలను వచ్చే మూడు నెలల్లో సమీక్షించుకోవాల్సిన అవసర ముందన్నారు. అమృత్ 2.0 పథకం, సమగ్ర శిక్ష అభియాన్, నేషనల్ హైవే స్, గ్రామీణ సడక్ యోజన, నేషనల్ హెల్త్ స్కీం, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన, వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఆవాస్ యోజన, పంచాయతీ రాజ్, మెప్మా పరిధిలోని ముద్ర రుణాలు తదితర వాటిపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ అర్వింద్ అధికారులను ఆదేశించారు.

పంచాయతీరాజ్, అటవీశాఖ పనితీరుపై అసంతృప్తి..

జిల్లాలో పంచాయతీరాజ్, ఆటవీ శాఖ పనితీరుపై ఎంపీ అర్వింద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇబ్రహీంపట్నం మండల కేంద్రం నుంచి వయా మిగతా 8వ పేజీలో..


హాజరైన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

బియ్యం సేకరణలో నిబంధనలు సడలించాలి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



వరి ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ బియ్యం సేకరణలో ఎఫ్‌సీఐ నిబంధనలను కొంత సడలించేలా ఎంపీ అర్వింద్ కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ కుమార్ కోరారు. వడ్ల కొనుగోళ్లు సజావుగా సాగేలా సహకరించాలన్నారు. జిల్లా అధికారులు, ఎఫ్‌సీఐ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసర ముందన్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం నిల్వలకు అవసరమైన గోదాములు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర జిల్లాల కంటే జగిత్యాల జిల్లాకు గోదాముల నిర్మాణానికి అత్యధిక నిధులు మంజూరు చేయించుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల సమన్వయంతో ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించేలా సహకరించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను నిబంధనల ప్రకారం పూర్తి చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రం నుంచి ఇప్పించాలని ఎంపీని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. మత్స్యకారుల సంక్షేమానికి అవసరమైన చర్యలను అధికారులు తీసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి

కలెక్టర్ సత్యప్రసాద్



ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాలల్లో ధాన్యం అధిక తూకాలకు పాల్పడడం, మిల్లర్లు కటింగ్‌లకు పాల్పడడం వంటివి జరిపితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. జిల్లాలోని పలు కేంద్రాల్లో నిర్వాహ కులు క్వింటాలుకు సుమారు 5 కిలోల నుంచి 10 కిలోల వరకు అధికంగా తూకం వేస్తున్నారని, మిల్లర్లు కోతలకు పాల్పడుతున్నా రని దిశ కమిటీ సభ్యుడు పాత రమేశ్ సమావేశంలో ప్రస్తావిం చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేకంగా సంఘ టనలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. అక్రమాలకు పాల్పడే వారిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి వ్యవహారంపై గత సీజన్‌లో మూడు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకున్నామని కలెక్టర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, డీఆర్‌డీవో రఘువరన్, దిశ కమిటీ సభ్యులు వడ్డెపల్లి శ్రీనివాస్, పాత రమేశ్, ఎర్ర లక్ష్మీ, ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశం అభివృద్ధి :అదనపు కలెక్టర్ బీఎస్ లత


మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ హిందీ, అరబిక్, బెంగాలి, ఇంగ్లీష్ భాషలలో అబుల్ కలాం ఆజాద్ గొప్ప పండితుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ శాఖ అధికారి చిత్రూ, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కిసాన్ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మల్లాపూర్ మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రాఘవపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరైన బిల్లులను పంపిణీ చేశారు. అలాగే రైతు బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్ల రాజన్న, బాపురెడ్డి, మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

జగిత్యాల అర్బన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఈనెల 17న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా మాదిగ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు దూమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్‌లు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విశ్వాసాలు, ధర్మాల పేరుతో చట్టాలను గౌరవించకుండా దాడులు చేస్తామంటే సహించబోమని హెచ్చరించారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ మీద దాడి జరిగితే ఈ దేశ వ్యవస్థలన్నీ ఎలాంటి చర్యలకు ఉపక్రమించకుండా మౌనం వహించి అంటరానితనాన్ని ప్రదర్శించాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బెజ్జంకి సతీష్, బోనగిరి కిషన్, శగారపు కాంతక్క, బొల్లి అనిల్, సంగెపు ముత్తు, పొడేటి సునీల్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఖేలో ఇండియా అస్మితా కిక్ బాక్సింగ్ పోటీల వాల్ పోస్టర్లను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా ఈనెల 19వ తేదీన జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో నిర్వమించిన కిక్ బాక్సింగ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బీఎస్ లత, రాజాగౌడ్, జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి రవి కుమార్, డీఆర్‌డీఓ రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఒ.శశిప్రియ హై జంప్‌లో గోల్డ్ మెడల్, టి.అనూష జావెలన్ త్రోలో సిల్వర్ మెడల్, పి.శిరీషా డిస్కస్ త్రో లో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ నెల 1న కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం పి.కిరణ్, పీడీ కృష్ణ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

పెంచిన ఆర్జిత సేవల ధరలు తగ్గించాలి

మల్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో ఆర్జిత సేవల ధరలను తగ్గించాలని మండల బీజేపీ నాయకులు ఈవో శ్రీకాంత్‌రావు ను కోరారు. భక్తులపై ఆర్థికభారం మోపడం సరికాదన్నారు. ధరల పెంపు విషయాన్ని దేవాదాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి గతంలో మాదిరిగానే యథాతథంగా ధరలు కొనసాగించాలని ఈవోను కోరారు. కార్యక్రమంలో గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, జనగాం రాములు, యాగండ్ల లక్ష్మీ నారాయణ గౌడ్, సంగని రవి, కెల్లెటి రమేశ్, పొన్నం సాయికుమార్‌గౌడ్, గుర్రం శ్రీధర్‌గౌడ్, బండారి రాజు, నీలం రవి, సంకీర్త్, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకే ఐక్యతాయాత్ర

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్


ఐక్యతాయాత్రలో పాల్గొన్న ఎంపీ అర్వింద్, కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతలో ఐక్యత, దేశ భక్తిని పెంపొందించేందుకే ఐక్యతా యాత్ర లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక వివేకానంద మినీస్టేడియంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని యూనిటీ మార్చ్(ఐక్యతాయాత్ర) పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో గొల్లపల్లి రోడ్‌లోగల మినీస్టేడియం నుంచి స్థానిక కొత్త బస్టాండ్ పటేల్ విగ్రహం వరకు మార్చ్ ర్యాలీని నిర్వహించారు. కాగా ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అర్వింద్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ చూపిన మార్గంలో యువత ముందుకు వెళ్తూ దేశ ఐక్యతకు పాటుపడాలన్నారు. పటేల్ కృషివల్లనే నేడు అఖండ భారతం ఐక్యంగా ఉందన్నారు. మహనీయుల జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకొని స్ఫూర్తిని పొందాలన్నారు. ఆయన సంకల్పం వల్లనే కాశ్మీర్‌నుంచి కన్యాకుమారి వరకు దేశం ఐక్యతా భావం నెలకొందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రతి జిల్లాలో పాదయాత్రలు (ఐక్యతా యాత్ర)లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర ఒగ్గుడోలు కళాకారులతో పాటు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందం బ్యాండ్‌తో విద్యార్థులంతా దేశభక్తి నినాదాలు చేస్తూ, ప్లకార్డులతో పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అర్వింద్, కలెక్టర్ సత్యప్రసాద్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్డీవో మధుసూధన్‌గౌడ్, డీవైఎస్‌వో రవికుమార్, సర్దార్ 150యాత్ర కన్వీనర్ శ్రీనివాస్, యేరా భారత్ యువ జగిత్యాల జిల్లా యూత్ ఆఫీసర్ వెంకట రాంబాబు, మైభారత్ ప్రోగ్రాం అధికారి రవీందర్, ఎన్ఎస్ఎస్ డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆడెపె శ్రీనివాస్, అధ్యాపకులు, అధికారులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, సుమారు 800 మంది యాత్రలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు కోరుట్ల విద్యార్థిని ఎంపిక


ఉనైబా జరీన్

కోరుట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఉనైబా జరీన్ కథలాపూర్‌లో జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీలలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నల్ల భూమయ్య మంగళవారం తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ అండర్ - 14 తరుపున ఖోఖో పోటీలలో పాల్గొన్న ఉనైబా జరీన్ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఆయన తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థిని ఉనైబా జరీన్‌తో పాటు అమెకు శిక్షణ ఇచ్చిన మహిపాల్ రెడ్డిలను పాఠశాల ప్రదానోపాధ్యాయుడు నల్ల భూమయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

దివ్యాంగుల రుణాలకు 14న ఇంటర్వ్యూలు

పెగడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రుణాల మంజూరు కోసం ఈ నెల 14న పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇనుగంటి ప్రేమ్‌సాగర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను దరఖాస్తుదారులకు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11.30 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. దరఖాస్తుదారులు మూడు సెట్ల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

రేపు బొమ్మెనలో కంటి వైద్య శిబిరం

కథలాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మెనలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక రెడ్డీస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ శిబిరంలో కరీంనగర్‌లోని రేకుర్తి కంటి వైద్య నిపుణులు రోగులను పరీక్షిస్తారని పేర్కొన్నారు. మోతె బిందు, కంటి శుక్లాలు కలిగి ఉన్న వారు ఈ శిబిరంలో వైద్యులచే పరీక్షలు చేయించు కోవాలని శస్త్ర చికిత్స అవసరమైతే ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు



జగిత్యాల బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

జగిత్యాల టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ బాంబు పేలుడు దృష్ట్యా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలతో పాటు రైల్వే స్టేషన్, బస్టాండ్, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలలో బాంబు స్క్వాడ్, పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహిచారు. అలగే పట్టణ సీఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్, టవర్ సర్కిల్‌తో పాటు పలు ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే భద్రతా చర్యలు సమర్థవంతంగా కొనసాగుతాయని అన్నారు. హై అలర్ట్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలు కనిపించినప్పుడు సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా 100 నెంబర్‌కు సమచారం అందించాలని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ నిరంతరం ప్రజల రక్షణలో తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేర మని అంగన్‌వాడీ జగిత్యాల ప్రాజెక్ట్ సీడీపీవో మమత అన్నారు. మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామ పంచాయతీ ఆవరణతో పాటు ఇటిక్యాల మోడల్ స్కూల్, తాట్లవాయి ప్రభుత్వ పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహ చట్టం-2006, పోక్సో చట్టం-2012, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, ఎస్ఎంసీ చైర్మన్ పాలెపు రక్షిత, మాజీ సర్పంచ్ సాగరిక, అంగన్‌వాడీ టీచర్ సుజాత, చిట్టమ్మ, కారో బార్ మహిపాల్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శ్రావణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, విలేజ్ స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్, బాల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్, గంగాధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీధర్‌రెడ్డి

భీమారం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీధర్‌రెడ్డి అన్నారు. భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైబర్ క్రైమ్, భరోసాపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, మహిళలు, బాలల భద్రతపై సూచనలు చేశారు. భరోసా కేంద్రం ద్వారా మహిళలు, బాలికలు ఎదుర్కొనే వేధింపు లపై తక్షణ సహాయం పొందవచ్చునని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని, భయపడకుండా తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జవ్వాజి అశోక్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు ద్యావనపెల్లి సరోజన, చెక్కపెల్లి రఘు, బస్వరాజుల రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి ప్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లు జరిగిన రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సంఘ సిబ్బంది అజయ్, కేంద్ర నిర్వాహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం 7లో..

అబుల్ కలాం ఆశయ సాధనకు కృషి -8లో..

ఫుడ్ పాయిజన్‌పై విచారణ

- పాడైన కోడిగుడ్లు, నిత్యం పచ్చిపులుసు
- వెల్లడించిన విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

జమ్మికుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో సోమవారం జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై తహసీల్దార్ వెంకట్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల సమక్షంలో మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇబ్బందులను వివరించారు. తక్కువ భోజనం పెడుతున్నారని, రెండోసారి వెళ్తే ఇంకా ఎంత తింటారు? మిగతా వారికి సరిపోవద్దా? అంటారని పేర్కొన్నారు. నిత్యం పలుచటి పప్పు, ఏ కర్రీలోకైనా పచ్చి పులుసు, నీళ్లు పోసుకొని తిన్నట్లుగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన కోడిగుడ్లు పెడుతున్నారని, వాసన వస్తున్నాయని చెప్పినా పట్టించుకోరని తహసీల్దార్ ఎదుట వాపోయారు. పావుకిలో పప్పుతో పలుచటి నీళ్ల లాంటి పప్పు, పచ్చి పులుసు, నాలుగు కిలోల బియ్యం, ఒక్క ఉల్లిగడ్డతో 70మంది విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వండి పెట్టారని ఉపాధ్యాయుడు శ్రీనివాస్ చెప్పడం, అలాంటిది ఏం లేదని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పరస్పరం విమర్శించుకోవడం చూసి అక్కడున్న అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి తీసుకున్న స్టేట్‌మెంట్‌ను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ లిపారు. ఆహార పదార్థాల నుంచి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్‌రెడ్డి శాంపిల్స్ సేకరించారు. రిపోర్టు వచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, సీఐ రామకృష్ణగౌడ్ ఉన్నారు.

తపాలా బీమాతో ధీమా

- తక్కువ ప్రీమియం
  ఎక్కువ ప్రయోజనాలు
- ఆసక్తి చూపుతున్న యువత



భగత్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నమ్మకం.. భద్రత... అనే ముద్ర వేసుకున్న తపాలా శాఖ ప్రజలకు మరింత భద్రత కోసం తపాలా జీవిత బీమా పాలసీలను అందిస్తున్నది. తక్కువ ప్రీమియం ఎక్కువ బోనస్ లభించే విధంగా బీమా పాలసీలను రూపొందించారు. తపాలా జీవిత బీమాతో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి పరిహారం అందుతుంది. ఈ తరుణంలో తపాలా బీమా పాలసీలపై యువత ఎక్కు వగా ఆసక్తి చూపుతుండటం విశేషం. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తపాలా శాఖ జీవిత బీమా పాలసీ లను అమలు చేస్తున్నది. మొదట్లో ఉద్యోగులకు మాత్రమే అందుబాటులో ఉన్న జీవిత బీమా పాలసీలను ఆ తరువాత క్రమంగా గ్రాడ్యుయేట్‌లు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉద్యోగులు, గ్రాడ్యుయేట్‌లకు (పిఎల్‌ఐ) సు రక్ష, సువిధ, సుమంగల్, సంతోష్, యుగల్ సరక్ష, జీవిత బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం (ఆర్పీఎల్ఐ) గ్రామ సురక్ష, గ్రామ సంతోష్, గ్రామ సువిధ, గ్రామ సుమంగల్, గ్రామ ప్రియ అందుబాటులో ఉన్నాయి. పిల్లల కోసం చిల్డ్రన్ పాలసీ కూడా అమలులో ఉంది. 19 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల మధ్య ఉన్న వారు ఈ తపాలా జీవిత బీమా పాలసీలకు అర్హులు. ప్రతి వ్యక్తి పీఎల్ఐ (పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) అయితే 50 లక్షలు, ఆర్పీఎల్ఐ (రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) అయితే 10 లక్షలు ఇన్సూరెన్స్ చేసుకునే అవకాశం ఉంది. ప్రీమియంపై ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. నామినిని మార్చుకునే వెసలుబాటు ఉండగా, పోస్టాఫీసులకు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే సదుపాయం ఉంది. ఇలా అనేక ఫీచర్లతో తపాలా శాఖ జీవిత బీమా పాలసీలను అమలు చేస్తు న్నది. జీవిత బీమా పాలసీలు అన్ని తపాల శాఖ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

బీమాపై స్పెషల్ డ్రైవ్

- తపాల శాఖ ఎస్పీ కె శివాజీ



తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీమా పాలసీలను ప్రజలకు చేరువ చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాము. ప్రజలను ఎక్కువ సంఖ్యలో తపాల జీవిత బీమాలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

పాఠశాలలో గడ్డిమందు తాగిన విద్యార్థి

● ఆస్పత్రిలో చేర్పించిన ఉపాధ్యాయులు

గన్నేరువరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బోయిని సాయికుమార్ అనే విద్యార్థి మంగళవారం తరగతి గదిలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రుల వివరాల ప్రకారం. గత శుక్రవారం సాయి కుమార్ మృతి చెందిన పామును పాఠశాలలోని తరగతి గదికి తీసుకొచ్చి తోటి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థిని మందలించి తల్లిదండ్రులను తీసుకు రావాలని ఆదేశించారు. దీంతో శని, ఆదివారం సెలవు ఉండడంతో ఇంట్లో ఈ విషయాన్ని చెప్పలేదు. సోమవారం సైతం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన సాయికుమార్ తరగతి గదిలో గడ్డిమందు తాగాడు. వెంటనే ఉపాధ్యాయులు విద్యార్థి తండ్రి బోయిని చంద్రయ్యకు సమాచారం అందించి అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతానికి విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నా 24 గంటలు గడిస్తేనే ప్రాణాపాయం తప్పుతుందని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంఘటనపై పాఠశాల హెచ్ఎం రామయ్యను వివరణ కోరగా సాయికుమార్ పాఠశాలలో ఆకతాయి పనులు చేస్తూ తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, తండ్రిని పాఠశాలకు పిలిపించి పరిస్థితి వివరించామని తెలిపారు. దీంతో తన తండ్రి దండిస్తాడేమోనన్న భయంతో గడ్డిమందు తాగినట్లు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, విచారణ చేపడతామని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపు వద్ద మంగళవారం ప్రమాదవశాత్తు కింద పడడంతో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విధుల్లో భాగంగా ప్రతాప్ ద్విచక్రవాహనంపై హుజూరాబాద్ నుంచి వెళ్తుండగా కేసీ క్యాంపు వద్ద ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన మడ్డి నాగరాజుగౌడ్ మంగళవారం ఈత చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. గ్రామశివారులో ఈత చెట్టుపై కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదశాత్తు నిచ్చెన జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 27 మందికి జరిమానా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి జిల్లా రెండో తరగతి జ్యుడీషియల్ న్యాయమూర్తి జయశ్రీ జరిమానా విధించారని మంగళవారం ఎస్ఐ రాహుల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల తనిఖీలు నిర్వహించగా 27 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని గుర్తించామని పేర్కొన్నారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా న్యాయస్థానంలో హాజరుపరిచామని చెప్పారు. 27 మందికి మొత్తం 69.5 వేల జరిమానా విధించారని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

కోనరావుపేట మండలంలో ఎనమిది మందికి..

కోనరావుపేట : మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మందిని రెండో తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట మంగళవారం ప్రవేశపెట్టగా 14 వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

పొగతో విద్యార్థినులకు అస్వస్థత

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చెత్త తగలబెట్టగా వెలువడిన పొగతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటనతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. జిల్లా కలెక్టర్ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో పాఠశాల ఆవరణలోని చెత్తను తగులబెట్టగా, అక్కడే ఉన్న రెగ్జిన్ కవర్లు, ఇతర పాత సామగ్రిని మంటల్లో వేశారు. అదే సమయంలో కళాశాల విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తుండడంతో కొంత మంది విద్యార్థినులను తరగతి గదిలో, మరి కొందరిని బయట కూర్చొబెట్టి పరీక్షలు రాం ుుంచార ు. ఒక్కసారిగా వెలువడిన పొగ, దుర్వాసనతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కళాశాల ప్రిన్సిపాల్ అంబులెన్సులో 11 మంది విద్యార్థినులను జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించారు. ముగ్గురిని వెంటనే డిశ్చార్జి చేసిన వైద్యులు తొమ్మిదిని ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. అంతకుముందు కొంత మంది విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త నుంచి వెలువడిన పొగ కారణంగానే విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారని, జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు చికిత్స కోసం పంపించామని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత విద్యార్థినులకు ఇళ్లకు పంపించినట్లు వైద్యులు చెప్పారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఖనిలో పోలీసుల విస్తృత తనిఖీలు

కోల్‌సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, లక్ష్మీనగర్, ఓల్డ్ అశోక థియేటర్‌తో పాటు ముఖ్య కూడళ్లలో తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లక్ష్మీనగర్‌లో దుకాణాల సముదాయాల ప్రాంతంలో నిలిపి ఉన్న వాహనాలను, బస్టాండ్‌లో ప్రయాణీకుల బ్యాగులను తనిఖీ చేశారు. వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్, భూమేష్, అనూషతో పాటు డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.




గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి, బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆసక్తిగా ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

కథలాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మాస్ట్రో ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలు ఆసక్తిగా సాగాయి. పోటీలను ప్రారంభించిన ఎంఈఓ లోకిని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. జీవితంలో ఓటమి, గెలుపులు సహజమని ఓటమిని గుణపాఠంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. సమయం మన కోసం మళ్లీ రాదని అవకాశాలు వచ్చినప్పుడే వాటిని వినియోగించుకుంటే జీవితంలో విజయతీరాలకు చేరుతామని అన్నారు. సాయంత్రం ముగింపు ఉత్సవాలకు హాజరైన కోరుట్ల సీఐ సురేశ్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అటు విద్యతో పాటు క్రీడల్లో బాగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.

● అట్టహాసంగా క్రీడలు ప్రారంభం

జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన జట్లు హాజరుకాగా ఒలంపిక్ దీపం వెలిగించి లాంగ్ మార్చ్ నిర్వహించడంతో పోటీలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా బాలుర విభాగంలో జగిత్యాల ప్రథమ స్థానం, పెద్దపల్లి ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానం, జగిత్యాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు కోరుట్ల సీఐ మెడల్స్, జ్ఞాపికలను అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ చక్రధర్, పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, పాఠశాల పీఈటీలు లంబా, మల్లేశ్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ రవీందర్, క్రీడాకారులు, వివిధ పాఠశాలల పిజికల్ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.



ఖోఖో పోటీల్లో తలపడుతున్న జట్లు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రఘుపతిరెడ్డి (ఫైల్)

కథలాపూర్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం పోసానిపేట శివారులోని ఎల్లమ్మ గుడి సమీపంలో మంగళవారం లారీ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో జవిడి రఘుపతిరెడ్డి (30) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం తాండ్ర్యాల శివారులో ఉన్న పొలం చూసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా దాణాతో వెళ్తున్న లారీ అతి వేగంగా బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే రఘుపతిరెడ్డి మృతిచెందాడు. లారీ కల్వర్టు వద్ద బోల్తా పడగా ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు పరిశీలించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి రాజరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి



కళ్యాణి (ఫైల్)

బోయినపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం మిడుమానేరు డ్యామ్ కట్ట సమీపంలో ఈ నెల 9న రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లి గ్రామానికి చెందిన జెట్టి కళ్యాణి(25) తన మేనబావ బరిగల శ్రీశైలంతో కలిసి బైక్‌పై కొదురుపాక సమీపంలోని మిడ్ మానేరు డ్యాం కట్టపైకి వెళ్లారు. బైక్‌పై తిరిగి వస్తుండగా మెయిన్ రోడ్డుకు సమీపంలో ఎదురుగా వచ్చిన బోయినపల్లి మండలం అనంతపల్లికి చెందిన కారు డ్రైవర్ మీరాల శరత్‌చంద్రరెడ్డి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కళ్యాణి తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 10న రాత్రి కళ్యాణి మృతిచెందింది. మృతురాలి తండ్రి జెట్టి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు



కోనరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో మంగళవారం వీధి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన దేవనపెల్లి కౌసల్య, లింగంపల్లి దేవయ్య లు ఇంటికి వెళుతుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. గ్రామస్థులు కుక్కను చెదరగొట్టి చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా వీధి కుక్కల దాడిలో చాలామంది గాయపడుతున్నారని, వాటి నుంచి కాపాడాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

నేరస్థుడికి ఏడాది జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని ఓ మహిళపై అఘాయిత్యానికి యత్నించిన కేసులో చేగుర్తికి గ్రామానికి చెందిన నిందితుడు కల్లేపల్లి శ్రీనివాస్‌కు కరీంనగర్ కోర్టు మంగళవారం ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కల్లేపల్లి శ్రీనివాస్ 2017లో మహిళపై అఘాయిత్యం చేయడానికి ప్రయత్నించగా సదరు మహిళ ప్రతిఘటించింది. కేకలు వేయగా చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు వచ్చేసరికి నిందితుడు పారిపోయాడు. ఆ తరువాత బాధితురాలి ఫిర్యాదుతో కరీంనగర్ రురల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ పరమేశ్వర్ సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. ఏపీపీ రంజిత్ కుమార్ సాక్షులను విచారించిన అనంతరం కరీంనగర్ రెండవ అడిషనల్ జేఎఫ్‌సీఎం జడ్జి వెంకట సత్యరాజ్‌కిరణ్ పూర్వాపరాలు పరిశీలించి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించారు.

ఎల్ఎల్‌బీ విద్యార్థుల ఆందోళన

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్శిటీలో ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం మొదటి ఇంటర్నల్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో కళాశాలలో మొత్తం 91 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 40 మంది విద్యార్థులకు హాజరు శాతం లేకపోవడంతో అనుమతించలేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పరీక్ష రాసేందుకు విద్యార్థులు యూనివర్శిటీలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి చేరుకున్నారు. హాజరు తక్కువ ఉన్న విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వవద్దని ముందే నిర్ణయం తీసుకున్న యూనివర్శిటీ అధికారులు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో హాజరు తక్కువ ఉన్న విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు అనుమతి ఇవ్వాలని, తాము పరీక్ష రాసేందుకు ఇబ్బంది ఏమిటని అధికారులను ప్రశ్నించారు. తక్కువ హాజరు ఉన్నా ఇంటర్నల్ పరీక్ష రాయవచ్చని హైకోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయని అధికారులకు వివరించారు. అనంతరం విద్యార్థులను పరీక్ష కేంద్రం బయటకు పంపించారు. ఈ విషయంలో విద్యార్థులు మాట్లాడుతూ కనీస హాజరు శాతం లేకున్నా పరీక్ష రాసే అవకాశం ఉంటుందని, అవేవీ పట్టకుండా అధికారులు తమను టార్గెట్ చేస్తున్నారని, పైరవీలతో వచ్చిన పలువురు విద్యార్థులకు అనుమతి ఇచ్చారని ఆరోపించారు.



ఆందోళనకు దిగిన విద్యార్థులు

కాలం చెల్లిన సరుకులు వాడితే చర్యలు

- కరీంనగర్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అంకిత్‌రెడ్డి

జమ్మికుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన సరుకులు వాడితే కటిన చర్యలు తప్పవని కరీంనగర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్ రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ఓ బేకరీలో తనిఖీలు చేపట్టారు. కేకు తయారీలోకి ఉపయోగించే ఆరు రకాల ప్రొడక్ట్‌ను పట్టుకున్నారు. వాటిని ల్యాబ్‌కు తరలించనున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా అంకిత్‌రెడ్డి మాట్లాడుతూ బేకరీలు, దుకాణాలు, జనరల్‌స్టోర్స్‌లో కాలం చెల్లినవి వాడితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. దుకాణదారులు కాలం చెల్లిన వస్తువులు విక్రయిస్తే వినియోగదారులు తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

తన సమస్య తీర్చాలని సెల్ టవర్ ఎక్కిన యువకుడు

● కేసు నమోదు చేసిన పోలీసులు

సైదాపూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెనపల్లికి చెందిన బోరగళ్ల రాజు అనే యువకుడు మంగళవారం సెల్ టవర్ ఎక్కాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నచ్చ జెప్పి టవర్ దింపారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. బోరగళ్ల రాజు ఇంటి వెనకాల ఉన్న భూమి కొన్ని సంవత్సరాల క్రితం సంజావ్ అనే అతడి వద్ద నుంచి లింగ స్వామి కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి బోరగళ్ల రాజు, లింగస్వామి మధ్య గొడవలు అవుతు న్నాయి. చాలా సార్లు పంచాయతీలు నిర్వహిం చారు. తన ఇంటి వెనకాల భూమి ఎలా కొంటావని లింగస్వామిని రాజు అడిగేవాడు. ఎట్టకేలకు లింగస్వామి ఆ భూమిని రాజుకు విక్రయించేం దుకు అంగీకరించాడు. ఈ క్రమంలో తన ఇంటి వెనకాల భూమి తాను అనుకున్న ధరకు ఇప్పించాలని రాజు టవర్ ఎక్కాడు. రాజును అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.



సెల్ టవర్ ఎక్కిన బోరగళ్ల రాజు


యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

కోరుట్ల రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన కుడుముల ప్రశాంత్(33) అనే యువకుడు మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం ప్రశాంత్ ఎంబీఏ పూర్తి చేశాడు. ప్రశాంత్ తన తండ్రి శంకర్‌తో కలిసి చేపలు పట్టి అమ్మేవాడు. ప్రశాంత్‌కు కొన్ని రోజుల నుంచి మానసిన స్థితి బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రశాంత్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెల్దిలో వృద్ధుడి అదృశ్యం



రాయమల్లు

మానకొండూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్దికి చెందిన మారవేని రాయమల్లు (80) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని సీఐ సంజీవ్ తెలిపారు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రించారు. కుమారుడు తిరుపతి తెల్లవారుజామున లేచి చూసే సరికి తండ్రి కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం



క్రీడా పోటీలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

సుల్తానాబాద్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచుకోవచ్చని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 11 క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అదనపు కలెక్టర్‌కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. జిల్లా సమన్వయకర్త మణిదీప్తి, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి కలిగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో క్రీడల నిర్వహణపై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించగా, జ్యోతిబాపూలే గురుకులాల జిల్లా సమన్వయకర్త మణిదీప్తి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, సంక్షేమ అధికారి సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్లతో ఆర్‌ఎం సమీక్ష



మాట్లాడుతున్న ఆర్‌ఎం రాజు

భగత్‌నగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలో డిపో మేనేజర్లతో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబరులో డిపోల పనితీరు, ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. రానున్న మేడారం జాతరకు సన్నద్ధతపై చర్చించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్యాకేజీ టూర్స్ యాత్రా దానం కార్యక్రమాలపై ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్.భూపతిరెడ్డి, పి .మల్లేశం, డిపో మేనేజర్లు ఎం.నాగభూషణం, ఎస్.వెంకన్న, రవీంద్రనాథ్, విజయమాధురి, ఎం.శ్రీనివాస్, వి.శ్రవణ్ కుమార్, కె కల్పన, మనోహర్, దేవరాజు, టి.ప్రకాశ్‌రావు, శ్రీనివాస్, జి .సత్యనారాయణ, ఎ.శంకరయ్య, ఎల్.మల్లేశం, ఆర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

అసౌకర్యాల మధ్య చదువులు

- ఇరుకైన గదులు.. విద్యార్థుల ఇక్కట్లు
- అద్దె భవనంలో ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్‌ఎస్ బాలురు డిగ్రీ, జూనియర్ కళాశాల...



ఇరుకైన గదిలో బ్యాగుల మధ్య పాఠాలు వింటున్న ఇంటర్ విద్యార్థులు

అద్దె భవనంలో కొనసాగుతున్న కళాశాల

ఎల్లారెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అభ్యసించాల్సిన గ్రామీణ ప్రాంతంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అరకొర వసతుల మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సౌకర్యాలు, కిటికీలకు తలుపులు సైతం లేకపోవడంతో చలికి, దోమలకు విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. తరగతి గదుల్లో ఉదయం పాఠాలు వినడంతో పాటు అదే గదిలో రాత్రి నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ (బాలురు), జూనియర్ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతోంది.

● అద్దె భవనం.. అవస్థలమయం

మండల కేంద్రంలో వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అప్పటి ప్రభుత్వం 2022లో మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ(బాలురు) కళాశాలను కేటాయించింది. ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని 2023 సంవత్సరం జూలైలో కళాశాల, వసతి గృహాన్ని ప్రారంభించింది. డిగ్రీ కళాశాలలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పెద్దూర్‌లోని జూనియర్ కళాశాలను అధికారులు ఇక్కడకు తరలించారు. జూనియర్ కళాశాలలో మొత్తం 79 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సరిపడా గదులు లేవు. డిగ్రీ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరంలో 12 గ్రూపులను కొనసాగిస్తున్నారు. ఒకే గదిలో రెండు నుంచి నాలుగు గ్రూప్‌లకు సంబంధించిన విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. జూనియర్ కళాశాలలో రెండు గ్రూప్‌లను కలిపి ఒకే గదిలో బోధిస్తున్నారు. తరగతి గదుల్లోనే విద్యార్థులు తమ వస్తువులు, దుస్తులు, పడకలను పక్కన పెట్టుకుని వాటి మధ్య పాఠాలు వినాల్సి వస్తోంది.

● విద్యార్థుల ఇబ్బందులు

డిగ్రీ, జూనియర్ కళాశాలలో చదువుతున్న 134 మంది విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేయాల్సి వస్తోంది. తరగతి గదులకు కిటికీలు లేకపోవడం చలితో గజగజవణుకున్నారు. సరిపడా స్నానపు గదులు లేవు. భోజనశాల లేదు. ఇటీవల వర్షాలతో ప్రహరీ కూలి కుక్కల ఆవరణలోకి వస్తున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

- వీరప్రభాకర్, ప్రిన్సిపాల్



డిగ్రీ, జూనియర్ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతుండడం వల్ల పూర్తిస్థాయిలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదులు సరిపడక గదిలో ఓ వైపు విద్యార్థులు కూర్చొని పాఠాలు వింటూనే రాత్రి సమయంలో డెస్కులను వెనుకకు ఉంచి నేలపై నిద్రిస్తున్నారు. వసతుల కల్పనపై ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

ఒకే గదిలో పాఠాలు, పడకతో ఇబ్బందులు..

- లింగాల గిరిధర్, విద్యార్థి



నేను డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాను. ఒకే గదిలో ఉదయం పాఠాలు వింటూ రాత్రి సమయంలో నేలపై పడుకోవాల్సి వస్తోంది. చదువుకునేందుకు అవస్థలు పడుతున్నాం. తరగతి గదులు సరిపోవడం లేవు. అన్ని వసతులు కల్పించాలి.

చన్నీళ్లతో జ్వరాలు వస్తున్నాయి

- తంగళ్లపల్లి వర్షిత్, విద్యార్థి



కళాశాలలో చేరి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాను. చలి అధికమవుతున్న చన్నీళ్లతో స్నానం చేయాల్సి వస్తోంది. చలికి తట్టుకోలేకపోతున్నాం. చన్నీళ్ల వల్ల జ్వరం, దగ్గు, జలుబు బారిన పడుతున్నాం. వేడి నీళ్ల సమకూర్చి మా ఇబ్బందులను తీర్చాలి.

కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వ్యక్తి అరెస్ట్

పెద్దపల్లిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వ్యక్తిని మంగళవారం పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కోర్టు ట్రయల్‌కు గైర్హాజరవుతున్న రాఘవాపూర్‌కు చెందిన మార్కు సదానందంపై పెద్దపల్లి మేజిస్ట్రేట్ వారెంట్ జారీ చేశారని, దీంతో సదానందంను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఏసీపీ కృష్ణ ఆదేశాలతో సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల ప్రకారం సక్రమంగా హాజరై తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

లారీని తప్పించబోయి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

● తప్పిన పెనుప్రమాదం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

కథలాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం ఇప్పపల్లి శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద మంగళవారం ఎదురుగా వస్తున్న గ్యాస్ లారీని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. కోరుట్ల డిపోకు చెందిన టీఎస్ 21 టీ 5162 నంబర్ గల ఆర్టీసీ బస్సు 40 మంది ప్రయాణికులతో వేములవాడ నుంచి కోరుట్లకు వస్తోంది. కోరుట్ల వైపు నుంచి వేములవాడకు గ్యాస్ లోడ్‌తో లారీ ఎదురుగా రావడంతో ఒక్కసారిగా బస్సు అదుపు తప్పింది. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ అయూబ్ రోడ్డు పక్కనే ఉన్న భారీ గుంతలోకి వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

రాజన్న ఆలయంలో స్క్రాప్ తరలించేందుకు టెండర్లు

వేములవాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వివిధ భాగాలలో పేరుకుపోయిన స్క్రాప్ తరలించేందుకు టెండర్లు నిర్వహించారు. మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో నిర్వహించిన టెండర్‌లో వేములవాడకు చెందిన ఒకరు, హైద్రాబాద్‌కు చెందిన ఆరుగురు కాంట్రాక్టర్లు పాలుపంచుకున్నారు. సామగ్రిని ఐదుగురు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. స్క్రాప్ సామగ్రి టెండర్‌లలో ఏడుగురు కాంట్రాక్టర్‌లు చర్చించుకొని ఒక్కో సామగ్రిని ఒక కాంట్రాక్టర్ కైవసం చేసుకున్నారు. టెండర్‌లలో ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్, ఈఈ రాజేష్, డీ మహిపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న నిత్య కల్యాణంలో చిరిగిన చీర

● ఈనెల 3న పొందిన దంపతులు

వేములవాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్య కల్యాణంలో చిరిగిన చీర ప్రత్యక్షమైంది. గత సోమవారం కల్యాణం చేయించుకున్న భక్తులకు చిరిగిన చీర వచ్చింది. అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంనకు ఆర్జిత సేవలు మార్చిన సందర్భంగా నిత్య కల్యాణం, శాశ్వత కల్యాణాలు అన్నదానసత్రం పైఅంతస్థులో కొనసాగుతున్నాయి. ఈనెల 3న కరీంనగర్‌లో ఉంటున్న నూతన దంపతులు శ్రీలత, శ్రీపతి కల్యాణం చేయించుకున్నారు. వీరికి సమర్పించిన చీరను ఇంటికి వెళ్లాక చూసుకునే సరికి చీకుపట్టి చిరిగిపోయి ఉంది. చీరను చూసి ఆ దంపతులు ఆందోళన చెందారు. చీరలను దేవస్థానంనకు



భక్తులకు అందిన చిరిగిన చీర

టెస్కో నుంచి సరఫరా అవుతాయి. ప్రతి చీరకు రూ.300 బిల్లు ఆలయం ద్వారా చెల్లిస్తారు. అయితే నాసిరకం చీరలను సరఫరా చేయడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చీరను చూసి ఆవేదన చెందాం

- శ్రీలత, శ్రీపతి దంపతులు, కరీంనగర్

తాము ఈ నెల 3న శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నాం. అనంతరం రెండు టికెట్లు తీసుకొని కల్యాణం చేయించుకున్నాం. ఇంటికి వెళ్లాక చీరను చూసే సరికి చిరిగి ఉంది. దీంతో చాలా ఆవేదన చెందాం. నాసిరకం చీరె ఇవ్వంపై ఆలయ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

మరోసారి కాకుండా చూస్తాం

- బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఏఈవో

కల్యాణంలో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం. కల్యాణం అనంతరం భక్తులకు ఇచ్చే చీరను పరిశీలించాకే భక్తులకు అందజేస్తాం. చిరిగిన చీరను మార్చి కొత్త చీర ఆ భక్తులుకు ఇస్తాం.

ఏటీసీతో ఉపాధి అవకాశాలు

● ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

తంగళ్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)తో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని ఏటీసీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మొత్తం ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని ప్రిన్సిపాల్ అడగగా 166 మంది చదువుతున్నట్లు వివరించారు. వివిధ కోర్సుల ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లడుతూ యువత ఏటీసీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని లోతుగా తెలుసుకోవాలని, ప్రాక్టికల్‌గా కూడా నిత్యం సాధన చేయాలని సూచించారు. ఈ దశలో నేర్చుకున్న అంశాలు ఉద్యోగానికి, వృత్తి జీవితంలో ఉపయోగపడుతాయని తెలిపారు. సమయాన్ని వృథా చేసుకోవద్దని తరగతులను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కవిత, తహసీల్దార్ జయంత్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిది, పదోతరగతి విద్యార్థుల ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనిల్ ప్రకాష్ తెలిపారు. దరఖాస్తులు www.tgepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు ప్రయాణం



కొండగట్టు ఘాట్‌రోడ్డుపై వాహనాలు

మల్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి వద్దకు చేరుకునే ఘాట్‌రోడ్డుపై ప్రతి మంగళ, శనివారాల్లో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయి. సమక్క, సారక్క జాతరకు ముందు వేలాది భక్తులు వందలాది వాహనాల్లో కొండగట్టుకు వస్తున్నారు. దీంతో వాహనాలను ఘాట్‌రోడ్డుకిరువైపులా రాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకు అలాగే ఉంచుతుండడంతో రోజంతా కొండపైకి వచ్చే భక్తుల వాహనాలకు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. వైజంక్షన్ వద్ద మూడు మార్గాల్లో వెళ్లే వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఘాట్‌రోడ్డు నుంచి కొండపైకి వాహనాలు ఎక్కాలన్నా, దిగాలన్నా పద్మవ్యూహం చేధించినట్లు అవుతుందని వాహనాల డ్రైవర్లు పేర్కొంటున్నారు. వాహనాలను ఘాట్‌రోడ్డుపై నిలుపకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం

మల్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా వచ్చిన భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనం కోసం బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసంతో పాటు సమ్మక్క సారలమ్మ జాతర రానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, అధికారులు పర్యవేక్షించారు. అంజన్నను దర్శించుకున్న భక్తులు బేతాళుడు, శ్రీరాముని ఆలయంలోనూ పూజలు జరిపారు.

అంజన్న సన్నిధిలో సుప్రభాత సేవ

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 15నుంచి నూతనంగా ప్రవేశపెట్టనున్న సుప్రభాత సేవ సాధ్యాసాధ్యాలను మంగళవారం దేవస్థానం అధికారులు పరిశీలించారు. సేవలో పాల్గొనడానికి ఇద్దరికి అవకాశం ఉండగా టికెట్ రుసుము రూ.వెయ్యి. మంగళవారం భక్తులు 12 టికెట్లు కొనుగోలు చేశారని సుప్రభాత సేవ కార్యక్రమం విజయవంతం అయినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ సేవ ద్వారా భక్తులకు స్వామి వారి మొదటి దర్శన సౌకర్యంతో పాటు దేవస్థానం తరఫున ఒక కండువా, రెండు కనుములు, స్వామి వారి 400గ్రాముల అభిషేక లడ్డూ అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్‌తో పాటు ఆలయ అర్చకులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు. అయితే సుప్రభాత సేవ టికెట్ ధర అధికంగా పెట్టారని దీనిపై ఇద్దరికి కాకుండా కనీసం నలుగురి నుంచి ఐదుగురికి అవకాశం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



కొండగట్టులో భక్తులు



బద్దిపోచమ్మ దేవాలయం వద్ద భక్తులు

బద్దిపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి

వేములవాడ టౌన్ : కార్తీకమాసం సందర్భంగా వేములవాడ బద్దిపోచమ్మ దేవాలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిమంది భక్తులు అమ్మవారికి బోనం వండి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. కార్తీక మాసం సందర్భంగా భీమేశ్వరాలయంలో కార్తీక వైభవం నెలకొంది. మంగళవారం భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

కొనసాగుతున్న గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి వద్ద గోదావరి హారతి 21వ రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్నపద్మావతి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి నారాయణ, సీనియర్ సివిల్ జడ్జి వెంకట మల్లిక్ సుబ్రమణ్యశర్మ, జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలు, పెద్దలపై తీవ్ర ప్రభావం

- నివారించగల అంటు వ్యాధి న్యుమోనియా
- నేడు ప్రపంచ న్యుమోనియా దినోత్సవం



సుభాష్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రతి వెయ్యి మందిలో 11 మంది న్యుమోనియా బారిన పడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. న్యుమోనియాపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం నవంబరు 12న ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, 60 సంవత్సరాలపైన వారికి రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. వారు న్యుమోనియా బారిన పడేందుకు అవకాశం ఉం టుంది. న్యుమోనియా నివారించగల, చికిత్సతో నయం చేసే అవకాశం ఉన్న అంటు వ్యాధి. ఈ వ్యాధిని త్వరగా గుర్తిస్తే నివారించ వచ్చు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. న్యుమోనియా, ఇతర శ్వాసకోశ అంటూ మరణాల సంఖ్య గత కొన్ని సంవత్సరాలలుగా పెరుగుతూ వస్తోంది.

● ఈ సంవత్సరం థీమ్ 'పిల్లల మనుగడ'

ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం పిల్లల మనుగడ అనే థీమ్‌ను తీసుకున్నారు. పిల్లల మరణాలనికి ప్రధాన కారణంగా న్యుమోనియాను గుర్తించారు. మంచి పోషకాహారం, స్వచ్ఛమైన గాలి, టీకాలు, యాంటి బయాటిక్స్ అందించడం ద్వారా న్యుమోనియాను తగ్గించవచ్చు. సకాలంలో రోగ నిర్ధారణ చేస్తే వ్యాధిని త్వరగా అరికట్టవచ్చు. న్యుమోనియా సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లగాలులు, వాతవరణ కాలుష్యం, గాలి, దుమ్మూ ధూళిపై జాగ్రత్తగా ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు మాస్కు ధరించాలి.

టీకాలు అందుబాటులో ఉన్నాయి..

- డాక్టర్ రవీంద్రాచారి, పల్మనాలజిస్టు



న్యుమోనియా నివారించదగ్గ వ్యాధి. సకాలంలో గుర్తించి డాక్టరును సంప్రదిస్తే చికిత్స అందించి వ్యాధిని నయం చేయవచ్చు. ఇపుడు పూర్తిగా నయమయ్యే టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ఆ టీకాలు తీసుకుంటే వ్యాధిని తగ్గించవచ్చు. ఇందులో రెండు రకాలు ఉంటాయి. డాక్టర్ సూచన మేరకు టీకాలు తీసుకోవాలి.

ప్రపంచ వ్యవసాయ సదస్సుకు కోనరావుపేట రైతులు



సదస్సుకు వెళ్లిన రైతులు

కోనరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల రైతులకు అరుదైన అవకాశం దక్కింది. జర్మనీలో మంగళవారం ప్రారంభమయ్యే ప్రపంచ వ్యవసాయ సదస్సుకు కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాతు బండ శ్రీనివాస్, కాటిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు సోమవారం బయలుదేరి జర్మనీకి వెళ్లారు. ఈ సదస్సులో మంగళవారం ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు సుస్థిర సాగు విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఆవిష్కరణలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, మార్గదర్శకులు చర్చించినట్లు రైతులు తెలిపారు.

బావిలో పడి వలస కూలీ మృతి

బీర్‌పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం చిన్న కొల్వాయి గ్రామ శివారులోని లిఫ్ట్ ఇరిగేషన్ బావిలో పడి మంగళవారం వలస కూలీ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ప్రకాశం జిల్లా కలికివాయ బిట్రగుంట గ్రామానికి చెందిన మానికల రామకృష్ణ(52)తో పాటు మరి కొంత మంది కలిసి చిన్న కొల్వాయి లిఫ్ట్ ఇరిగేషన్ బావిలో ఇసుక పూడిక తీయడానికి 15 రోజుల క్రితం వచ్చారు. సోమవారం రాత్రి మానికల రామకృష్ణ లిఫ్ట్ బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు పేర్కోన్నారు. మంగళవారం ఎస్‌ఐ రాజు, ఎస్ఆర్ఎస్‌పీ డీఈఈ చెక్రు నాయక్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఏఈ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కండేయ స్వామి ఆలయంలో పూజలు

జగిత్యాల అర్బన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీ బక్త మార్కండేయ స్వామి ఆలయంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మంగళవారం పూజలు నిర్వహించారు. శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో శ్రీ ఆంజనేయ స్వామి వారి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నా జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కోరుట్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యా నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకోవాలని పొలాస అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు సూచించారు. మంగళవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా కేరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్రికల్చర్ బీఎసీసీ కోర్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు నరసింహ మూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారులు రత్నాకర్, అర్చనలు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆశయ సాధనకు కృషి

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ -జిల్లావ్యాప్తంగా అబుల్‌కలాం జయంతి



మాట్లాడుతున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


ధర్మపురి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో అబుల్ కలాంకు నివాళి

జగిత్యాల అర్బన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): అబుల్ కలాం ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణం లోని తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా ఐఐటీ, నీట్‌లో సీట్లు సాధిస్తు న్నారని కొనియాడారు. కుల, మత సామాజిక మార్పు విద్యతోనే సాధ్యమన్నారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన భోజన వసతులు కల్పించింద న్నారు. అంతకుముందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులకు మెమోంటోలు, ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన ఆయన అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుచిత్ర, నాయకులు ఎంఏ ఆరీఫ్, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, ఖాజీం అలీ, షోయబ్ ఉల్ హక్, స్వామి రెడ్డి, ప్రభాత్ సింగ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

●**జగిత్యాల టౌన్:** మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరవలేనివని మౌలానా అబుల్ కలాం ఆజాద్ యూత్ అధ్యక్షుడు ముజహిద్ ఆదిల్ అన్నారు. పట్టణంలోని తీన్ ఖని చౌరస్తా వద్ద అబుల్ కలాం ఆజాద్ యూత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జగిత్యాల పట్టణంలో అబుల్ కలాం ఆజాద్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు సిరాజోద్దీన్ మన్సూర్, మీర్ ఖాజిం అలీ, జుబేర్ మాలిక్, రియాజ్, సోహైల్, ఖైసర్, నాజీమ్, నేహాల్, సలావొద్దీన్ మున్నా, అఫ్రోజ్, నాహిద్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో మౌలానా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం కోసం పనిచేయా లన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. విద్య ప్రాముఖ్యత, ఆవశ్యకతనను నొక్కి చెప్పడం జరిగింది. ఈసంద ర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి ప్రొఫెసర్ కాంతాకుమారి, ప్రిన్సిపాల్ ఆర్. జ్యోతి, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, ఎంఈవో సీతాలక్ష్మి, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు ఎండీ రఫియొద్దీన్, ముఫ్తీ జుబైర్ సాహెబ్, దారుల్ ఖైర్ సొసైటీ అధ్యక్షులు జహంగీర్, జామే మసీదు ఇమామ్ అజీముల్లాబేగ్, నాయబ్ సర్దార్ కుతుబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** పట్టణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఆయన సేవలు దేశ ప్రజలు ఎన్నటికి మరిచిపోరని వారు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

●**రాయికల్:** కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు మరువ లేనివని రాయికల్ సెంట్రల్ ముస్లీం కమిటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ షాకీర్ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం రాయి కల్ పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నివాస్, సెంట్రల్ ముస్లీం కమిటీ అధ్యక్షుడు మహ్మద్ సోహెల్, తబ్లిక్ జమాత్ అధ్యక్షుడు మహ్మద్ సాబీర్, అబ్దుల్ ఇమ్రాన్ హషాం, ఉపాధ్యాయులు ఇంతియాజ్, లైఫోద్దీన్, హేమావతి, జరీనా, ఇస్నాక్, సురేందర్ పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వేణు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన కృషిని కొని యాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.భాస్కర్, కళాశాల అధ్యాపకులు జైపాల్‌రెడ్డి, ప్రమోద్, బాల కృష్ణారెడ్డి, జయశీల, అనిల్, సుమన్, శ్యాం కుమార్, దీక్షిత, వాలంటీర్లు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

(ఐదో పేజీ తరువాయి)

యామాపూర్, ఫకీర్ కొండాపూర్ మీదుగా నడికుడ వరకు రూ.3.83 కోట్ల నిధులతో నిర్మించ తలపెట్టిన రహదారి పట్ల అధికారులు నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 సంవత్సరంలో మంజూరైన రహదారి నిర్మాణానికి అవసరమైన ఫారెస్ట్ క్లియరెన్స్‌ను అధికారులు చేయకపోవడం పట్ల అసంతృప్తిని తెలిపారు. అధికారుల నిర్వాకం వల్ల సంబంధిత నిధులు మురిగిపోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ సూచించారు. సంబంధిత పనులు 2026 మార్చిలోగా పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కనీసం ఫారెస్ట్ క్లియరెన్స్ పూర్తి కాకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పని గడువును పెంచడానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఎంపీ అర్వింద్ ఆదేశించారు.

ఘనంగా కార్తిక దీపోత్సవం


కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోరుట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త బస్టాండ్ అంజనేయ స్వామి దేవాలయంలో కార్తిక దీపోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసం పురస్కరించుకోని అర్చకులు ఉద్దంటి శ్రీకాంత్, శ్రీధర్ మంత్రోత్సరణంతో దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ విక్రం, జూనియర్ అసిస్టెంట్ పైడిపల్లి నర్సయ్య, దేవాలయ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు గుంటుకు జ్ఞానేశ్వర్, గాండ్లోజీ రాజయ్య, అన్నం హరీష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్కాపూర్ గ్రామంలో మంగళవారం సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాయికల్ తహసీల్దార్ నాగార్జున ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం నరహరి, ఆర్‌ఐ బద్ది దాసు, సీసీ సుజాత పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

బీర్‌పూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని కండ్లపెల్లి గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి తిరుపతి ఆధ్వర్యంలో పత్తి, వరి పంటల దిగుబడి అంచన వేయడంతో పాటు పంట కోత ప్రయోగాలను చేపట్టారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈవో వినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'స్టూడెంట్ క్లబ్‌లతో ప్రయోజనం'

కొడిమ్యాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : స్టూడెంట్ క్లబ్‌లతో బహుళ ప్రయోజనాలను పొందవచ్చునని జేఎన్‌టియు ప్రిన్సిపాల్ జి.నరసింహ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రకాల స్టూడెంట్ క్లబ్‌లను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకత వెలికి తీయడానికి స్టూడెంట్ క్లబ్‌లు దోహదపడుతాయన్నారు.

'కొండగట్టులో భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చాలి'

కొడిమ్యాల, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : కొండగట్టులో అంజనేయస్వామి భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని కోరుతూ మంగళవారం ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందించినట్లు తెలిపారు. కొండగట్టు ఆలయ భూములను కాపాడుతూ, అధిక ధరలను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దూర ప్రాంతాల నుండి అంజనేయస్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు మరిన్ని సౌకర్యాలను కలిపిస్తూ, అభివృద్ధిని చేయాలని రవీందర్ వినతిపత్రంలో కోరారు.

ఎంపీ అర్వింద్‌కు ఘన స్వాగతం

మెట్‌పల్లి టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన మంగళవారం మెట్టపల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు రాగా స్థానిక నాయకులు స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, రాష్ట్ర నాయకులు రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాసన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి, దోనికెళ్ల నవీన్, బద్దం గంగాధర్ రెడ్డి, గుంటుక సదాశివం, సుంకేటి విజయ్, ఇల్లెందుల శ్రీనివాస్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

'ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి'

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇసుక బజార్‌లో వినియోగ దారులకు అందుబాటులో ధరలు ఉంచాలని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. అక్రమంగా ఇసుక తరలింపు, విక్రయాలను నివారించాల్సిన అవసరముందని జీవన్‌రెడ్డి లేఖలో కోరారు.

అందెశ్రీ మృతి కళారంగానికి తీరని లోటు

జగిత్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, వాగ్గేయ కారుడు అందెశ్రీ మృతి కళారంగానికి తీరని లోటని తెలంగాణ రచయిత వేదిక జగిత్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు దేవరశెట్టి జనార్ధన్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆమే మాట్లాడారు. కళారంగానికి అందెశ్రీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. భౌతికంగా అందెశ్రీ దూరమైనప్పటికీ ప్రజల హృదయాల్లో చిరంజీవిగా నిలుస్తారన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** సహజ కవి అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంతి మోహన్ రెడ్డి అన్నారు. మగళవారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సాహితి చైతన్యం వెలకట్టలేనిదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీత రచయితగా అందెశ్రీ రచనలు, కవిత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, కోశాధికారి పడిగేలా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజెల్లి రాందాస్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** ప్రజాకవి అందెశ్రీ మృతికి గొల్లపల్లి మండల కేంద్రంలోని డా. బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ఆయన అభిమానులు, సాహితీప్రియులు, నాయకులు, యువకులు మంగళవారం ఘన నివాళులర్పించారు.కార్యక్రమంలో తాజామాజీ ప్రజాప్రతినిధులు ఆవుల సత్తయ్య, మారం రాజశేఖర్, నాయకులు కచ్చు కోమురయ్య, జేరిపోతుల కోమురయ్య, చౌట్‌పెల్లి తిరుపతి, అంకం భూమయ్య, కలకోట సత్యం, చెవులమద్ది శ్రీనివాస్, భోనగిరి మల్లారెడ్డి, పొనగంటి రాజరత్నం, జనుప వెంకటేష్, బోండ్ల నాగరాజ్, నక్క విజయ్, గంగాధర మధుసూదన్, ఎనగందుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

పెగడపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని ల్యాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న ఇంటి నిర్మాణం నిలుపుదల చేయాలని కోరుతూ మంగళవారం ల్యాగలమర్రి గ్రామస్థులు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వం కొన్నేండ్ల క్రితం లేఅవుట్ చేసి నివాస గృహాలు నిర్మించగా, కాలనీ అవసరాల కోసం వదిలిపెట్టిన భూమిలో కల్లెపల్లి తిరుపతి, కల్లెపల్లి సాయిలు అను వ్యక్తులు అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని కోరతూ గ్రామ మాజీ సర్పంచ్ ఆరెల్లి గంగయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎల్కటూరి రవితో పాటు దాదాపు 20 మంది మంగళవారం ఎంపీడీవోను కలసి ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

కోరుట్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక మోసాలు సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఆర్బీఐ అర్థిక అక్షరాస్యత కేంద్రం మేడిపల్లి వారి ఆధ్వర్యంలో సైబర్, ఆర్థిక మోసాలను అనే అంశంపై గ్రామంలో అవగాహన సదస్సును నిర్వహించంగా కోరుట్ల రెండవ ఎస్‌ఐ రామచంద్రుడుతో కలిసి ఎంపీడీఓ రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై బెటింగ్ గేమ్స్ మోజులో పడి యువత మోసం పోవద్దని అన్నారు. సైబర్ నేరాలతో మోసం పోతున్న వారు 1930 నంబర్‌కు కాల్ చేయ్యాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులకు ఓటీపీ నంబరులను షేర్ చేయ్యవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శ్రవణ్, ఎపీం సమతా, మాజీ సర్పంచ్ పిడుగు రాధ - సంధయ్యలతో పాటు గ్రామస్థులు యువకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు అన్నారు. మండలంలోని ఎర్రాపూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వరప్రసాద్, ఏపీఎం శంకర్‌లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, భూమారెడ్డి, సుదర్శన్, రమేష్, నల్ల వెంకటి, సీసీలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాల సేకరణ

ఇబ్రహీంపట్నం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపూర్, కొజన్, కొత్తూరు గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల అర్హత వివరాలను క్లస్టర్ అధికారి రాజ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్దిదారుల ఆర్థిక పరిస్థితిగతులు, వ్యవసాయ భూముల వివరాలు, ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలం, తదితర పత్రాలను నిర్మాణానికి లబ్దిదారుల సంసిద్ధత అంశాలను రికార్డు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాణి, రాకేష్, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారుల పాలనలో కుంటుపడిన అభివృద్ధి

●సమస్యల వలయంలో గ్రామాలు ●మోరపల్లిలో తాగునీటికి ఇక్కట్లు ●పట్టించుకోని అధికారులు


మోరపల్లిలో ట్యాంకర్ ద్వారా నీరు పట్టుకుంటున్న కాలనీవాసులు

జగిత్యాలరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడంలేదు. గ్రామాల్లో మంచినీరు, విద్యుత్తు, పారిశుధ్యం వంటి సమస్యల పరిష్కారానికి, ట్రాక్టర్ల నిర్వహణకు డీజిల్, వీధిదీపాలు, విద్యుత్తు మోటార్ల మరమ్మతు వంటి సమస్యలు తలెత్తితే వాటి ఖర్చులకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇవేమి వారు పట్టించుకోకపోగా ఆ బాధ్యత కార్యదర్శులదే అన్నట్లుగా వ్యవహరిస్తుండంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు.

మోరపల్లిలో తాగునీటికి కటకట..

జగిత్యాల రూరల్ మండలం మోరపల్లిలోని ఎస్సీకాలనీలో వారం రోజులుగా తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కారించాల్సిన ప్రత్యేకాధికారి, కార్యదర్శి చేతు లెత్తేశారు. దీంతో గత్యంతరం లేక బోర్ మోటార్‌ను మూడుసార్లు కాలనీవాసులే బాగు చేయించుకున్నారు. రూ.45 వేలు వరకు వెచ్చించామని కాలనీవాసులు తెలిపారు. నాలుగోసారి విద్యుత్తుమోటార్ చెడిపోగా కార్యదర్శి దృష్టికి సమస్యను కాలనీ వాసులు తీసుకెళ్లారు. గ్రామపంచాయితీలో నిధులు లేవని చేతులెత్తేశారని కాలనీవాసులు ఆరోపించారు. వారం రోజులుగా తాత్కాలికంగా జీపీ ట్రాక్టర్‌తో సరఫరా చేస్తున్నా నీరు సరిపోవడం లేదని మోరపల్లి ఎస్సీకాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు

-గంగారాం, మోరపల్లి గ్రామస్థుడు



మోరపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి బోర్ విద్యుత్తు మోటార్ చెడిపోవడంతో కాలనీకి నీరు అందడంలేదు. దీంతో సమస్యలను పంచాయితీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా జీపీలో నిధులు లేవని అన్నారు. అధికారులు పట్టించుకోవడంలేదు.

త్వరలోనే సమస్య పరిష్కారిస్తాం

రమాదేవి, ఎంపీడీవో



జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీవాసులు ఎదుర్కొంటున్న నీటి సమస్య నా దృష్టికి రాలేదు. ఎస్సీ కాలనీవాసులు ఎదుర్కొం టున్న సమస్యను కార్యదర్శి ద్వారా నివేదిక తెప్పించుకొని సమస్యను తొందరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు విన్నవించాలి.

'ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం'

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, ప్రతి కార్యకర్తల పార్టీ పటిష్టత దిశగా ముందుకు సాగాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామానికి చెందిన మారంపల్లి భీమరాజు ఆధ్వర్యంలో సుమారు 60మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరగా వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ రావు, పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, రాష్ట్రబాధ్యులు శ్రావణి, జిల్లా బాధ్యులు నలువాల తిరుపతి, మురళి, కళావతి, ఆముదరాజు, దివాకర్, డాక్టర్ చిట్నేని రఘు, ఏలేటి నరేందర్‌రెడ్డి, కొడిపెల్లి గోపాల్ రెడ్డి, బద్దం గంగాధర్ ఉన్నారు.


పార్టీలో చేరిన వారికి కాషాయ కండువా కప్పుతున్న ఎంపీ అర్వింద్

ఎంపీని కలిసిన న్యాయవాదులు

ఎంపీ అర్వింద్‌ను జిల్లా న్యాయవాదులు కలిశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ కోర్టును ఏర్పాటుకు అనుమతితో పాటు, పలు మౌలిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు, కార్యదర్శి అందె మారుతి, సీనియర్ న్యాయవాదులు బండ భాస్కర్‌రెడ్డి, మారిశెట్టి ప్రతాప్, గోవిందుల రాజన్న, ఎర్ర నర్సయ్య, రాంచంద్రంలున్నారు.

టెట్ మినహాయింపు ఇవ్వాలి

2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద రావు, యాల్ల అమర్నాథ్‌రెడ్డిలు ఎంపీ అర్వింద్‌కు వినతిపత్రం సమర్పించారు.

రైల్వేపాసుల పునరుద్ధరించాలి

జర్నలిస్టుల రైల్వేపాసులను పునరుద్ధరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా శాఖ బాధ్యులు, జర్నలిస్టులు మంగళవారం ఎంపీ అర్వింద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు గడ్డల హరికృష్ణ, హైదర్‌అలీ, కోశాధికారి వేణుగోపాల్, జర్నలిస్టులు రాజేందర్‌రెడ్డి, ఆనంద్, వంశీకృష్ణ, చింత లక్ష్మణ్ తదితరులున్నారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థులు క్రీడలలో రాణించినట్లు ప్రిన్సిపాల్ బాబు మంగళవారం తెలిపారు. గురుకుల జోనల్ టు అండర్ 19 గేమ్స్‌లో పాల్గొన్న విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాణించినట్లు ప్రిన్సిపాల్ తలిపారు. కబ్బడీ పోటీలలో పాఠశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచినట్లు తెలిపారు. ఎస్జీఎస్ స్కూల్ గేమ్స్, మోగాలో గోల్డ్ మెడల్స్, అండ్ సిల్వర్ మెడల్స్ సాదించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జిల్లా లెవల్ పోటీలలో 13 మెడల్స్ వచ్చాయన్నారు. వాటిలో ఐదు గోల్డ్ మెడల్స్, 5 సిల్వర్, 3 బ్రాంస్ మెడల్స్ వచ్చినట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ బండి బాబులతో పాటు ఉపాధ్యాయులు సన్మానించారు.

పాఠశాలకు బెంచీలు అందజేత

ఎండపల్లి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు 38బెంచీలను ప్రభుత్వం అందించింది. మన ఊరు మన బడి కార్యక్రమం కింద రూ.5 లక్షల విలువ చేసే 38 బెంచీలను అందించారు. విద్యార్థు లందరికి సరిపడా బెంచీలు రావడం పట్ల హెచ్‌ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేశారు.

హక్కుల సాధనకు పోరాటం

కోరుట్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకై యాదవులు పోరాటాలకు సిద్ధం కావాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని సర్పరాజుపూర్ గ్రామంలో యాదవ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని నిర్వహించి మాట్లాడారు. యాద వులకు న్యాయంగా దక్కవలసిన హక్కుల ప్రభుత్వాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో యాదవ సంఘ సభ్యులు అరకంటి సాగర్ యాదవ్, కల్లూరి దేవయ్య యాదవ్, అలిశెట్టి బుచ్చి రాములు యాదవ్, భూపతి గంగాధర్ యాదవ్, పలువురు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

కోరుట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆంజేయ స్వామి దేవాలయ హుండీ లెక్కింపు మంగళవారం దేవాలయ శాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి పర్యవేక్షణలో నిర్వహించారు. హుండీ ఆదాయం రూ. 71,241 నగదు సమకూరినట్లు ఈఓ విక్రం తెలిపారు.

●**కోరుట్ల రూరల్:** వెంకటాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ హుండా లెక్కంపు మంగళవారం దేవాలయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి పర్యవేక్షణలో నిర్వహించారు. దేవాలయ ఆదాయం రూ. 83,426 నగదు, మిశ్రమ బంగారం 3.500 ఎంజీలు, మిశ్రమ వేండి 175.00 గ్రాములు వచ్చినట్లు దేవాలయ ఈఓ విక్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేశం, ధర్మకర్తలు ద్యాగ రాజిరెడ్డి, పోతుగంటి రాజేశంగౌడ్, మాజీ ఎంపీపీ తోట నారాయణ, మాజీ ఉప సర్పంచ్ విఠల రవీంధర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బసవతారక ఇండో అమెరికా క్యాన్సర్ ఆసుపత్రి, రీసర్చ్ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని మంగళవారం ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు, డాక్టర్ గంగాసాగర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఇందులో బసవతారక ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు రవి శంకర్, రేణుక, ప్రవళిక, హరీష్, లక్ష్మణ్, పీఆర్ఓ మేనేజర్ బిందు, పబ్లిక్ హెల్త్ మేనేజర్ ప్రేరణలు పాల్గొని ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ పరీక్షలు చేయించుకోవాలంటే ఒక్కొక్కరికి రూ.10వేల ఖర్చు అవుతుందని, తాము మాత్రం ప్రజల కోసం ఉచిత క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్, జడ్‌సీ పోలీస్ శ్రీనివాస్, ఇల్లెందుల శ్రీనివాస్, పోహార్ తుకారం, దొంతుల ఆంజనేయులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సాజిద్, అమరేశ్వర్, ఆనంద్ బాబు, గడ్డం రమేష్, కిరణ్, జాకబ్, లయన్స్ క్లబ్ సభ్యులు బాస నర్సింగరావు, గంగుల పండిత్, ముద్దం ప్రసాద్, జగదీశ్వర్, రఘుపతి, మృత్యుంజయ వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు